వాటు చేసుకుంటున్నారు.

రాజమ్మ ఒక తవ్వెడు జొన్నరవ్వ చేటలో తెచ్చి జానకమ్మ ముందు పెట్టింది. ఇంటి అరుగు మీద దిగాలుగా కూర్చున్న జానకమ్మ ఆ జొన్నరవ్వ చూసి గుడ్లనీళ్లు కుక్కుకున్నది.

''ఇట్లా ఎంతకాలం సాయం చేస్తవ్ రాజమ్మా! నీ రుణం ఎట్ల తీర్చుకోవాలె'' అన్నది జానకమ్మ.

జానకమ్మను దగ్గరికి తీసుకొని ఓదార్చాలని అనిపించింది రాజమ్మకు. కానీ, వాళ్లు పెద్ద కులం వాళ్లు. తమదేమో తక్కువ కులం.

''అమ్మగారూ! కట్టాలు కలకాలం ఉండవు. కానీ, నీ కట్టం ఒకరు తీర్సగలిగేది కాదు. ఆ బగమంతుడే తీర్చాలె. ఈ గింజలు గట్క వొండు. అయ్యగారికి, ఈ పిల్లలకు ఇంత తినిపించు. బాధపడతా కూసుంటే ఆకలి తీరదు కదా అమ్మా'' అంటూ ఓదార్చి వెళ్లిపోయింది రాజమ్మ.

అప్పటికి రెండు రోజులైంది ఆ ఇంట్లో పొయ్యి రాజేసి. జానకమ్మకు ఆ గింజలే అమృతం లాగా అనిపించింది. జొన్న గటక తినడం పిల్లలకు ఎంతో కష్టమైంది. కొడుకు వెంకటాచార్యులు జొన్న గటక చూసి..

''అమ్మా! ఇది మనం తినే అన్నంలాగా లేదు కదమ్మా'' అంటూ మొహం విరిచాడు.

''నాన్నగారికి ఆరోగ్యం తొందరగా నయం కావాలంటే.. ఈ ఆహారమే ఇవ్వాలని డాక్టరు చెప్పాడు బాబూ. మరి నాన్నగారికి త్వరగా నయం కావాలి కదా నాన్నా'' అంటూ నచ్చచెప్పింది జానకమ్మ.

కష్టాల ఊబిలో ఉన్న జానకమ్మకు ఎలాగైనా సహాయం చేయాలని అనుకున్నది రాజమ్మ. కానీ ఏం చేయాలో అర్థం కాలేదు. అదే విషయం తన భర్తతో మాట్లాడింది. అతడి సలహా నచ్చింది ఆమెకు.

మర్నాడు రాజమ్మ తాను చేనుకు వెళ్లేటప్పుడు..

''జానకమ్మ గారూ! నాతోపాటు చేనుకు పోదాం రా. ఊరికెనే ఇంట్ల కూసుంటే గుబులుగ ఉంటది'' అంటూ తనవెంట చేనుకు తీసుకెళ్లింది. అక్కడ ఒక గంట తర్వాత జానకమ్మకు విసుగు అనిపించింది. రాజమ్మ ఒక గంప తెచ్చి జానకమ్మకు ఇచ్చింది.

''నాకు కాస్త సాయం చెయ్యండి అమ్మగారూ! ఈ పండు మిరపకాయలు తెంపి బుట్టలో వెయ్యి. ఏదో పని చేస్తా ఉంటే.. మనసు తెరిపిన పడుతది కదా!'' అని ప్రోత్సహించింది.

చేనులో కూలోళ్లను చూస్తూ కూర్చుంటే, నిజంగానే విసుగు చెందిన జానకమ్మకు.. కాస్త ఏదైనా పని చేస్తుంటే బావుండు అనిపించింది. రాజమ్మ చెప్పినట్లుగానే పండు మిరపకాయలు ఏరడం మొదలుపెట్టింది. సాయంకాలం ఇంటికి తిరిగి వచ్చాక, రాజమ్మ చేటలో జొన్నలు పోసి తెచ్చింది.

అట్లా జానకమ్మను, రాజమ్మ రోజూ తనతోపాటు చేనుకు తీసుకొనిపోయేది. సాయంకాలం ఇంటికి వచ్చాక.. జొన్నలో, సజ్జలో చేటలో పోసి తీసుకువచ్చి అరుగు మీద పెట్టేది.

నాలుగు రోజుల్లో జానకమ్మకు అర్థమైంది.. తను కూడా వాళ్లతో పాటు కూలి పనికి వెళుతున్నానని. కానీ, ఆ పని కూడా చేయకపోతే, ఆ కాసిన్ని తిండి గింజలు కూడా దొరకవనే సత్యం కూడా అవగతమైంది ఆమెకు.

ఆ విధంగా జానకమ్మను తన పరిధిలోకి తీసుకొచ్చుకున్నది రాజమ్మ.

''మీలాంటి పెద్దోల్లకు సాయపడితే మాకు పోయిన జన్మల పాపాలు పోతాయట తల్లీ'' అంటూ జానకమ్మను తనవెంట కూలికి తీసుకొని పోయేది రాజమ్మ.

* * *

కాలచక్రం తిరిగి పోయింది. వెంకటాచార్యులు చదువు పూర్తయ్యాక.. ప్రభుత్వ ఉద్యోగం దొరికింది. జానకమ్మ పెదనాన్న కొడుకు పరమేశం.. తన బిడ్డ పరిమళను వెంకటాచారికి ఇచ్చి పెళ్లిచేశాడు. పక్షవాతంతో మంచంలోనే ఉన్న వరదాచార్యులుకు మెరుగైన వైద్యం లభించడంతో కాస్త కర్ర పట్టుకుని నడవసాగాడు. కొడుక్కు ఉద్యోగం వచ్చాక జానకమ్మ కూలి పనికి వెళ్లడం మానేసింది. కానీ జానకమ్మ, రాజమ్మ మధ్య స్నేహం మాత్రం తగ్గలేదు. రోజుకు ఒకసారైనా కాసేపు కూర్చొని మాట్లాడుకోకపోతే వారికి మనసు తృప్తిగా ఉండదు.

అంతా సవ్యంగా ఉందని మనం అనుకుంటూ హాయిగా ఉంటే.. కాలం అలా కాదు కదా! తన పని తాను చేసుకుపోతూనే ఉంటుంది. రాజమ్మకు అకస్మాత్తుగా సుస్తి చేసింది. రెండు మూత్రపిండాలూ దెబ్బతిన్నాయని, మూత్ర పిండం మార్చకపోతే బతకదని చెప్పారు డాక్టర్లు. హాస్పిటల్లో రాజమ్మను చూడ్డానికి వెళ్లిన జానకమ్మ.. తన కిడ్నీని రాజమ్మకు ఇస్తానని చెప్పింది. డాక్టర్లు పరీక్ష చేసి.. ఆమె కిడ్నీ సరిపోతుందని చెప్పారు. కానీ, జానకమ్మకు ఇంట్లోంచి వ్యతిరేకత ప్రారంభమైంది.

వరదాచార్యులు, అతని వియ్యంకుడు పరమేశం దీనిని వ్యతిరేకించారు.

''తక్కువ కులం వాళ్లతో సహవాసం చేయడమే దోషం. నిత్యాగ్ని హోత్రంలాంటి మన శ్రీ వైష్ణవ కుటుంబాలకు, ఆ తక్కువ కులం వాళ్లతో సావాసం ఏమిటి? ఇంతకాలం అడిగేవాళ్లు లేరనేగా! ఇప్పుడు ఈ ఇంటికి పిల్లనిచ్చిన వ్యక్తిగా నేనందుకు ఒప్పుకోను. అసలు ఆ తక్కువ కులం వాళ్లతో స్నేహమే నాకు ఇష్టం లేదు. మనవి సంశ్రయణాలు చేసిన సంప్రదాయ కుటుంబాలు. నిత్యం పూజలు, పునస్కారాలు చేసే శ్రీ వైష్ణవులం. ఈ కుల భ్రష్టతకు నేను ఒప్పుకోను. మనవాళ్లు కిడ్నీలు కూడా అలాంటి వారికి ఇవ్వకూడదు'' అంటూ ఒంటి కాలు మీద లేచాడు పరమేశం.

తన బిడ్డను వెంకటాచార్యులకు ఇచ్చి పెళ్లి చేశాడు కాబట్టి.. ఆ విధంగా తన ఆధిక్యతను నిలుపుకోవాలని అతని ప్రయత్నం.

నివ్వెరపోయిన జానకమ్మ.. వెంకటాచార్యుల వైపు చూసింది. ఆమె కళ్లలో నీళ్లు లేవు. గత కాలంలో తాము పడిన కష్టం, రాజమ్మతో ఆమె స్నేహం, రాజమ్మ చేసిన సహాయ సహకారాలు అన్నీ కనిపించాయి వెంకటాచార్యులకు. నెమ్మదిగా లేచి వచ్చి, తల్లి భుజం మీద చేయి వేశాడు.

తల్లిని దగ్గరికి పొదువుకున్నాడు. ఆమె నుదుట ముద్దు పెట్టుకున్నాడు.

''మామయ్యా! మీ ఆరాటంలో అర్థం ఉన్నది. కానీ మానవత్వం లేదు. మా నాన్నగారికి జబ్బు చేసి, మంచాన పడి ఉన్న రోజున.. మేము గుక్కెడు గంజి నీళ్లకు నోచుకోని రోజున.. మన కులం ఏం చేసింది? మీరు అప్పుడు ఎక్కడున్నారు? నాకు ఈ రోజున గవర్నమెంట్ జాబు వచ్చిందని మీ అమ్మాయిని ఇచ్చి పెళ్లి చేసినంత మాత్రాన.. మా కుటుంబం మీద మీకు అధికారం రాదు కదా! మన కులం వాళ్లకు కొలమానం.. సంశ్రయణాలు కాదు, మానవత్వం. తక్కువ కులంలో పుట్టినా, రాజమ్మ తన సహృదయంతో మా కుటుంబానికి ఆసరాగా నిలిచింది. మమ్మల్ని ఆదుకున్నది. ఈరోజు ఆమె కష్టంలో ఉంటే కుంటి సాకులు చెప్పి తప్పించుకోవడం మానవత్వం అనిపించుకోదు. మా అమ్మకు, రాజమ్మకు మధ్య ఉన్నది స్నేహం కాదు.. గొప్ప అనుబంధం. ఒక్క మాటలో చెప్పాలంటే.. రాజమ్మ నాకు రెండో తల్లి. ఈ విషయంలో మా అమ్మ ఏ నిర్ణయం తీసుకుంటే, దానికి అందరం బద్ధులమై ఉండాలి. ఇష్టం లేనివాళ్లు ఇప్పుడే వెళ్లిపోవచ్చు'' అన్నాడు వెంకటాచారి ప్రశాంతంగా.

తూటాల్లాగా వెలువడిన ఆ మాటలలో ఒక నిర్దిష్టమైన నిర్ణయం కనిపించింది.

పరిమళ లోపలికి వెళ్లి బ్యాగు తెచ్చి తండ్రికి ఇచ్చి.. గుమ్మం దాకా సాగనంపి వచ్చింది.

ఆపరేషన్ సక్సెస్ అయింది.

జానకమ్మ, రాజమ్మ అరుగుమీద కూర్చొని ముచ్చట్లు పెట్టుకుంటూ ఉంటే.. కోడలు పరిమళ రెండు గ్లాసులతో టీ తీసుకొచ్చి ఇచ్చింది.

జానకమ్మ గతాన్ని గుర్తు తెచ్చుకుంటూ, రాజమ్మ చేనుకు వెళ్లిన మొదటి రోజు గురించి తలుచుకున్నది. ఆమె కళ్ల వెంట నీళ్లు తిరిగాయి.

జానకమ్మ కళ్లు తుడిచి, అక్కున చేర్చుకోవాలనుకున్నది రాజమ్మ. కానీ, కులం గుర్తుకు వచ్చింది రాజమ్మకు.

''అమ్మగారూ! మీరింకా కండ్ల నీళ్లు పెట్టే గాచారమేమున్నది? కాలమంత మారిపోయింది కదా. చెట్టంత కొడుకు నీకు అండగ ఉన్నడు. ఏడవకుండ్రి. కండ్లు తుడ్సుకోండి!'' అన్నది రాజమ్మ.

''నీ సావాసమే నాకు కొండంత అండ రాజమ్మా!'' అంటూ చీర కొంగుతో కళ్లు తుడుచుకున్నది జానకమ్మ.

## నెల్లుట్ల రుక్మిణి



కష్టాల్లో ఉన్నవారికి ఎలాగైనా సాయం చేయాలనే తపన.. మానవ జీవితానికి విలువను తీసుకొస్తుంది. అలాంటి తపనతో ఉన్న ఓ నిరుపేద స్నేహితురాలికి, ఆమె ఆప్యాయతకు, స్నేహబంధానికి, సామాజిక అంతరాలు అడ్డురావని చెప్పే కథ.. 'సావాసం'. రచయిత్రి నెల్లుట్ల రుక్మిణి. మనుషులను, జీవితాలను, ప్రకృతిని పరిశీలించడం.. చిన్నప్పటినుంచే అలవాటు చేసుకున్నారు. 50 ఏళ్ల కింద.. పదేళ్ల వయసులో తన పరిశీలన, అనుభవంలో ఉన్న విషయాలే.. 'సావాసం' కథకు మూలం. ఇల్లెందు క్రాంతి స్కూలు ప్రిన్సిపాల్‌గా పని చేసినప్పుడు.. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేసేవారు. ఆ పిల్లల తల్లిదండ్రులతో కలిగిన పరిచయం.. వీరిలో కథలు రాయాలనే తలంపునకు కారణమైంది. వారు చెప్పిన జీవిత వెతలనే, కథలుగా మలిచేందుకు ప్రయత్నించారు. వీరు రాసిన పలు కథలు.. కొత్తగూడెం రేడియో కేంద్రంలో మూడేళ్లపాటు ప్రసారమయ్యాయి. అనేక కథలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. 'వెన్నెల పూలు' బాలగేయ సంపుటి, 'బతుకు ఎతలు' కథల సంపుటిని ముద్రించారు. అనేక బహుమతులు, అవార్డులు, సన్మానాలు అందుకున్నారు. నిర్మాతగా.. శ్రీ వెంకటేశ్వర మహత్యం, ఈ రాత్రి గడిస్తే చాలు చిత్రాలను నిర్మించారు.